# ఆడే రెక్క మాడే డొక్క

ఇటు కన్యాకుమారి నుండి అటు కాశ్మీరు దాకా, తూర్పున వున్న బంగాళాఖాతం నుండి పశ్చిమ సముద్రం దాకా - వేలాది దేవాలయాలున్నాయి.

ఒక్కో దేవాలయం వొక్కో తీరులో వుంది. మహారణ్యాల మధ్యా, మహాగిరుల శిఖరాగ్రాల మీదా వెలసిన దేవాలయాలూ వున్నాయి. విజ్ఞాన, సాంకేతిక శాస్త్రాలు అంతలా పెరిగిన ఈ రోజుల్లో కూడా, ఈ దేవాలయ నిర్మాణ రహస్యాలు దురూహ్యంగానే ఉన్నాయి.

అక్కడెక్కడో అరణ్యంలో ఓ పరమ రమణీయమయిన దేవాలయం ఉంది. ఈ గుడి నిర్మాణానికి వాడిన రాళ్లు ఆ పరిసరాల్లో లేవు. అక్కడికి వందలమైళ్ళ దూరంలో ఉన్న కొండల్లో ఆ జాతి రాళ్ళున్నాయి. ఈ గుడికి, ఆ కొండలకూ మధ్య రెండు నదులు, బోలెడు వాగులూ ఉన్నాయి. తిన్నని బాటలు కూడా లేవుమరి. అయితే రాళ్ళను ఈ గుడి దాకా ఎవరు తీసుకొచ్చారు? ఎలా తీసుకొచ్చారు? ఆ రాళ్ళను వెన్నలా కరిగించి, శిల్పాలుగా తీర్చిదిద్దడానికి ఎన్ని వందల మంది శిల్పులు, ఎన్ని సంవత్సరాలు శ్రమించారు?

ఈ ప్రశ్నలకు జవాబులు మనకెక్కడా దొరకవు.

మరో చోట- ఇంకో రాతి స్తంభం ఉన్నది. ఇలా మీటుతూ వెళ్ళండి. ఆ రాతి స్తంభం నుండి సప్తస్వరాలు వినపడతాయి.

ఇంకో చోట నాలుగు తాడిచెట్లంత ఎత్తున రాతి స్తంభం, ఓ చిన్న ఆధారంతో, ఇంకో శిలాఫలకం మీద నిట్టనిలువుగా నిలుచుని మబ్బులతో మేలమాడుతూ ఉంటుంది.

వేరే ఒక చోట - మామూలు కొండగుట్టలను కొంటున్నచోట - ఆ కొండ గుహల్లో పరమాద్భుతమయిన వర్ణ చిత్రాలుండడాన్ని మనం గమనిస్తాం!

ఆ చిత్రాలను ఎవరు వేశారు? ఎప్పుడు వేశారు? ఎంత కాలం వేశారు? ఇన్ని శతాబ్ధాల కాలంలోనూ ఆ రంగులు వెలిసిపోకుండా ఎలా వున్నాయి?

ఒకే రాతిలో రథాన్ని మలచిన అపరబ్రహ్మల ఆచూకీ లేమిటి? ఒకే శిలాఫలకం మీద దశావతారాలను శిల్పించిన అపర సృష్టికర్త లెవరు? మూగరాల నుండి, ముడికొయ్యలనుండి దివ్యసౌందర్యాలను ఆవిష్కరించిందెవరు? మనకు తెలియదు.

"పోనీ మీరు చెబుతారా?"

"నిజంగా నాకు తెలియదండి!" అన్నాడు నాలగింగం. దుబ్బుగడ్డాన్ని అరచేత్తో రుద్దుకుంటూ.

"కాని మా ముత్తాత, తాతగారు, గొప్ప పనివారండి! ఆయన కంటితో చూసి రాయి కడుపులో దోషముందో లేదో చెప్పగలిగేవాడుట. ఉక్కు ఉలి పొడసుత్తి తీసుకొని రాయి ముందు కూచుంటేనండీ- ఉలి మొనలోంచి దేవుళ్ళు, దేవతలూ, అప్సరసలూ రాళ్ళ మీదికి దూకి, అక్కడే వుండిపోయేవారుట" అన్నాడు నాగలింగం.

నాగలింగం తాతగారు కూడా గొప్ప పనివాడేనట. ఆయన హయాంలో ఆయన్ను మించిన పనివారు చుట్టూ పక్కల లేనేలేడుట.

“నాకప్పుడు బాగా చిన్నతనమండి! పదేళ్ళు ఉంటాయేమో! మైసూరు మహారాజా వారికి కిరీటం చేయవలసి వచ్చింది. మా తాతగారికి కబురు వచ్చింది. ఆయనతో బాటు నేనూ వెళ్ళాను. అయిదారు మాసాలు మహారాజా వారి దేవిడిలో రాజభోగంగా గడిపాము. మైసూరు మహాశిల్పులకు, మా తాతగారు సాయం చేస్తూ ఉండేవారు... ఏమిచ్చారని అడక్కండి! మా తాతగారికి బంగారపు కంకణాలు ఇచ్చారు. అవి నా హయాంలోనే కరిగించుకు తిన్నాను...” అన్నాడు నాగలింగం బాధగా.

రాజులు పోయారు. రాజ్యాలు మాయమయ్యాయి. ఆదరణ కరిగిపోయింది. ఇవ్వాళ శిలాశిల్పమన్నా, దారు శిల్పమన్నా ఎందుకూ పనికిరాని విద్యలయిపోయాయి.

నాగలింగం చదువుకోలేదు. అయితేనేం? ఏ దేవతా విగ్రహం మలచాలన్నా శాస్త్ర ప్రకారం మలచగలడు. ఈ ‘శాస్త్రం’ అతనికి వంశానుగతంగా సంక్రమించింది. రాళ్ళు కొట్టి కొయ్యలు చెక్కి ఉలులునూరి బండబారిపోయిన ఆ చేతులు అతి సుకుమారమయిన శిల్పాలను ఎలా మలుస్తాయో మనకు అవగాహనకాదు.

నాగలింగానికి ముగ్గురు కూతుళ్ళు, ఇద్దరు కొడుకులు, కూతుళ్ళకు పెళ్ళిళ్లు చేశాడు. ఒక కొడుకును మందుల షాపులో ఉద్యోగానికి ఉంచాడు. రెండో వాడికి వడ్రంగం నేర్పాడు.

“ఈ వృత్తి కూడా పాడయిపోయిందండి! పనుల్లేవు. ఉన్నా - కూలి గిట్టుబాటుకాదు. ఉన్నప్పుడు వ్యవసాయం పనులు చేస్తా. తీరిగ్గా ఉన్నప్పుడు చిల్లరమల్లర పనులు చేస్తా... ఇక్కడ ఎలుకలు జాస్తిగా ఉంటాయండీ! మీరు చూస్తున్నవి ఎలకబోనులు, వెదురు చట్రాలు చేస్తాన్నేను. బద్ధ అల్లకం నరసిమ్మయ్యతో చేయిస్తా. నేను పెద్దవాణ్ని. ఊరూరా తిరగలేను. అందుకని, మా చిన్న వాణ్ని పంపుతా. కావిడేసుకుని సాయంకాలం దాకా అమ్ముకొస్తాడు. ఖర్చులు పోను, కూలి డబ్బులు మిగుల్తాయి.” అన్నాడు నాగలింగం. ఒకప్పుడు వందెకరాల మాన్యం ఉండేదిట. ఆస్తిపంపకాల్లో ముక్క చెక్కలయి, ఇప్పుడు కుంట తక్కువ నాలుగెకరాలు మాత్రం ఉందట.

“అది పండిచావదండీ! విత్తనాలు కూడా దండగే. వానలా పడవు. బావి తీసుకునే శక్తిలేదు. నిరుడు వేరుశనగ వేశా. నాలుగెకరాల మీదా, రెండు బస్తాలు పండినాయి. ఈ ఏడు ఆముదాలు వేద్దామనుకుంటున్నా... మీరు మా వాణ్ని చూస్తామన్నారుగా. వీడే మా రెండోవాడు” అన్నాడు నాగలింగం, ఎలకల బోనుల్ని కావిడికి బిగిస్తున్న కొడుకును చూపిస్తూ.